# ఇదే ఇదే జీవితం

కె. ఫణి ప్రసాద్

ఉదయం ఆరుగంటలవుతోంది! అప్పుడే సికింద్రాబాద్ స్టేషన్‌లోపలికి అడుగుపెట్టాను! ఆరోజు నేను గుంటూరు వెళుతున్నాను కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో! నేను వెళ్ళే రైలు ఏ ప్లాట్‌ఫారం మీద ఉంటో అని అనుకుంటూంటే "సికింద్రాబాద్ నుండి గుంటూరుపోవు కృష్ణాఎక్స్‌ప్రెస్ రెండవ నంబరు ప్లాట్‌ఫారం మీద నిలబడి ఉన్నది" అని మైక్‌లో ప్రకటన వినబడింది!

నేను రిజర్వు చేసుకున్న సీటులో కూర్చుని ఒక్కసారి స్టేషన్ పరిసరాలను కలయచూశాను! రైలెక్కిన ప్రయాణీకులతో, వారిని సాగనంపటానికి వచ్చిన వారితో, కాఫీ, టీ, టిఫిన్ వాళ్ళ కేకలతో, పోర్టర్ల వాద ప్రతివాదాలతో రైల్వేస్టేషన్ ఒక గమ్మత్తయిన సందడిని సంతరించుకుంది!

తరువాత కంపార్ట్‌మెంట్‌లో తోటి ప్రయాణీకులను ఒక్కసారి పరిశీలనగా చూశాను. ట్రెయిన్ ఎక్కేవాళ్ళతో దిగేవాళ్ళతో చాలా కుతూహలంగాను, ఎంతో గజిబిజిగా ఉంది! "మాస్టారూ మీకు రిజర్వేషన్ ఉందా" ఒకరు ఇంకొకరిని అడుగుతున్నారు." సార్ ఇదినాసీటు. దయచేసి మీరులేస్తారా" తమసీట్లో తామే కూర్చోవాలనే తాపత్రయం. "సార్ ఇది నేను ఎంతో కష్టపడి రిజర్వు చేసుకున్నసీట్ కాని ఈయనెవరో ఖాళీచెయ్యనంటాడు" ఒకరు కండక్టర్ దగ్గర ఫిర్యాదు. "అవునండీ ఎందుకు లేవాలి, ఈనెంబర్ సీట్ నాదే కావలిస్తే నాటికెట్ చూసుకోండి, 'ఐ డోంట్ నో ఫ్రెండ్, ఎంత చెప్పినా వినటంలేదు" మరొకరి రెండు భాషల్లో కలిసిన సమాధానం ఆ మాటలు వింటూంటే నాకు ఎంతో నవ్వొచ్చింది. ఎందుకంటే 'ఫ్రెండ్' అనే మాట వినపడుతోందే తప్ప, దాని అర్థం ఎవరి మాటల్లోను కూడా ధ్వనించటంలేదు!

అపార్థాలు, ఆవేశాలు చేసుకున్న సభ్యత అనే ముసుగు కొంతకాలం, కాకపోతే కొన్ని గంటల్లో ఎవరి గమ్యం వారు చేరుకునేలోగానే ఒకరిమధ్య ఒకరికి అపార్థం, ఆవేశం, అటు తర్వాత పలకరింపులు, పరిచయాలు, వీడ్కోలు విడిపోవటమూనూ ఇది పరిస్థితి. అందుకే వీటన్నిటి కలగలుపే ప్రయాణమేమో?

"బాబూ మీ సామానంతా లోపల పెట్టాను. నా కూలి ఇచ్చెయ్యండి." ఒక యువకుడు, ఇరవయేళ్ళుండొచ్చు నా పక్క సీట్లో తనసామాను సరి చూసుకుంటున్నాడు. "ఊ ఇవిగో డబ్బులు" సామాను సరిగ్గా చూసుకుని కూలికి డబ్బులివ్వబోయాడు. "ఇదేంటి రూపాయిచ్చారు, రెండు రూపాయలివ్వండి" కూలి డబ్బులు తీసుకోకుండా అన్నాడు! వెంటనే అతనికి కోపం వచ్చింది "అదేంటీముందు రూపాయేగా నువ్వు అడిగింది. మళ్ళీ ఇంకో రూపాయి ఎందుకు?" అతని మొహంలో కోపం, ఆశ్చర్యం రెండూ ఒకదానితో

ఇంకొకటి పోటీ పడుతున్నాయి. "అవునండి లోపలికి తీసుకొచ్చి మీ సీట్లో పెట్టానుకాదా" కూలి దబాయింపు "అంటే అందుకు మరో రూపాయి ఎక్కువ ఎంత మోసం"వా? ఆ యువకుడి ఆవేశం ఎక్కువయిపోయింది. "నే నివ్వను ఆ డబ్బులు తీసుకోకపోతే మానెయ్యి" అనేసి తన సీటో కూర్చున్నాడు."డబ్బులివ్వకుండా సామాను ఎలా ఇస్తాను" కూలి అతని పెట్టె పట్టుకున్నాడు. కోపంతో ఊగిపోతూ ఆ యువకుడు పెట్టెనిఅతని చేతిలోంచి లాక్కున్నాడు. ఈలోగా ఇద్దరు ముగ్గురు కూలీలు అక్కడ చేరి తమతోటి కూలిని సమర్థించారు. ఇక చేసేదిలేక ఆ యువకుడు ఆ మిగిలిన డబ్బులు కూడా ఎక్కువిచ్చి ఆ గొడవని అంతటితో వదిలించుకున్నాడు. అయిన అతని మనసు మాత్రం జరిగిన ద్రోహానికి, కోపంతో కుతకుతలాడిపోతోందని నేను అర్థంచేసుకున్నాను.

"మాస్టారూ టైమెంతయింది?" అతను నన్ను అడిగాడు.

"ఏడు కావస్తోంది" సమాధానంవినగానే "ఆరున్నరకి బయలుదేరాల్సిన రైలు ఇక్కడే అరగంటలేటు, ఇహ ఇది గుంటూరు చేరేటప్పటికి ఇంకా ఆలస్యమయిపోతుంది" అతని మాటల్లో విసుగు, చిరాకు వ్యక్తమయ్యాయి! అతనికేసి పరిశీలనగా చూశాను మనిషిలో నిజాయితీని వ్యక్తంచేసే మాటతీరు, ఆవేశంలో ఎరుపెక్కిన ముఖకవళికలు ఇవన్నీ ప్రస్ఫుటమవుతున్నాయి!

"మాస్టారూ నా పేరు వాసూ, నేను గుంటూరు వెళుతున్నాను. మీరెంతవరకూ?" అతను తన్ను తానే పరిచయం చేసుకొని నా వివరాలు అడిగాడు. చెప్పాను. ఇంతలో రైలు కదిలింది. అతనుమళ్ళీ ఒక్కసారి గాఢంగా నిట్టూర్చాడు. ప్లాటుఫారం దాటకుండానే మళ్ళీఆగిపోయింది. కారణం ట్రెయిన్‌లో వాటర్ సప్లయి లేదుట, ఎవరో ఎవరిద్వారానో తెలుసుకున్నారు.

"అంతే ఈ రైలువాళ్లు ఇక బాగుపడరు. అన్నీ ఉన్నాయో లేదో ముందే చూసుకుంటే ఎవడు కాదన్నాడు. ప్రయాణీకులను ఇలా ఏడిపించకపోతే" రైల్వేవారిపై వాసు విమర్శ. రైలు మళ్ళీ వెనక్కి వెళ్ళింది!

ఒక అరగంట తరువాత రైలు బయలుదేరింది! ఇంతలో "కాఫీ, కాఫీ" అంటూ రైల్వే కేటరింగ్ వారి మనిషి కాఫీ తీసుకొచ్చాడు. "ఎంతయ్యా కాఫీ" వాసు అడిగాడు. 'అరవయి పైసలు'.సమాధానం వినగానే వాసు మొహంలో ఒక మార్పు కనపడింది. "పొగవాసన వచ్చే ఈ నీళ్ళ కాఫీకి అరవై పైసలు ధర. ధర పెరుగుతోందేతప్ప కాఫీ రుచి మాత్రం అలాగే ఉంటుంది" అతని మాటల్లో ఎంత కాదన్నా నిజం లేకపోలేదు అని అనిపించింది నాకు.

అతన్నే పరిశీలించటం ప్రయాణంలో నాకు చక్కటి కాలక్షేపంగా ఉంది నాకు!

వాసూని మరొక్కసారి పరిశీలనగా చూశాను!

కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణిస్తున్న ప్రతిఒక్కరిని అతను గమనిస్తూనే ఉన్నాడు. ఆ గమనించటంలో ఒక అవ్యక్తమయిన ఆసక్తి ఉందేమో అనిపించింది! కాఫీ అతను మరోసారి కూడా తాగాడు. తాగుతూ అతను "ఏమిటయ్యా ఇది కాఫీయా, లేక చూరు నీళ్ళా" అని డబ్బులిస్తూ సరదాగా అన్నాడు. కాఫీ తెచ్చిన మనిషి మొహం చిన్నబోయింది. వాసు అన్న మాటకు పక్కనే కూర్చుని ఉన్న ప్రయాణీకులు కూడా కొంతమంది లోపల నవ్వుకుంటే మరి కొంతమంది పైకి నవ్వేశారు.

"వాసూ మంచి మాటకారి" ఎదుటి మనిషి గురించి నా ఊహ!

"పేపర్, పేపర్ సార్. సినిమా కబుర్లు, చిత్ర విచిత్రాలు" అంటూ ఇటు పేపర్లు అటు పుస్తకాల దొంతర్లు పట్టుకుని ఒకతను అమ్ముతున్నాడు. "ఏం పుస్తకాలున్నాయి నీ దగ్గర" వాసు అడి

గాడు.చాలా అడుగులోనే ఉన్న పుస్తకాలను పేరు పేరునా వెతుకుతున్నాడు. ఆ అమ్మే అతనికి వాసు ఆలోచన అర్థమయిందేమో అన్నట్టుగా "సార్ మీరు ఏం పుస్తకంకోసం వెతుకుతున్నారో నా కర్థమయిందలెండి." అని అతను భుజానికి వేలాడే సంచిలో చెయ్యి పెట్టాడు. వాసూ ఆశ్చర్య పోయి "ఏ పుస్తకం కోసం" అని అతనికేసి చూశాడు. "ఇవే కాదూసార్ మీకు కావలసినవి తీసుకోండి" అంటూ నాలుగు పుస్తకాలు అట్టలతో సహా వాసూకి అందించాడు. అతను వాటికేసి



చూశాడు. "ఈ పుస్తకాలా నేను అడిగింది" వాసూ కళ్ళల్లో ఎరుపురంగు పేరుకుని ఉంది! అప్పుడు ఆ పుస్తకాలకేసి నేనూ చూశాను. "సెక్స్ నవలలు" మనసులో కెలికినట్టయింది. "మనిషిని మనసుని వేడెక్కించే పుస్తకాలు సార్ తప్పేంలేదు. తీసుకోండి" అమ్మే అతను చొరవగా చెపుతున్నాడు వాసూతో.

"ఏమనుకుంటున్నావురా గాడిదా నాగరించి. పిచ్చివాగుడు వాగావంటే పళ్ళు రాలిపోతాయి" వాసు సీట్లోంచి లేచాడు. జరుగుతున్న సన్నివేశానికి అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. "ఇష్టం లేకపోతే కొనుక్కోటం మానెయ్యి. అంతేగాని ఇలా అరవటం దేనికి" వాసుని చూసిన అమ్మే అతను గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

"మన జీవితాలను తప్పుదారిలో నడిపి, వారిలో అశ్లీలతను ప్రోత్సహించే ప్రయత్నాలలో ఇదుగో ఇదొకటి" వాసు నాకేసిచూస్తూ అన్నాడు. అతని మాటలు నిజాన్ని ఒప్పుకోమని నన్ను బలవంతం చేశాయి.

"కొన్ని నియమాలకు, నిర్ణయాలకు వాసు జీవితం పరిమితమై ఉందని" ఆ సంఘటన వ్యక్తం చేసింది.

"ఒక మనిషిని మరో మనిషి అతి తేలికగా అంచనా వెయ్యడం అనేది వ్యాపారంలో ఒక సూత్రం" అంటూ వాసుతో అన్నాడు అతని పక్కన కూర్చున్న ఒక ప్రయాణికుడు.

"మనిషిని మరో మనిషి మోసంతో తప్పుదారిలో నడిపించటమే వ్యాపారం అయితే అందుకు శిక్ష ఎప్పుడో అప్పుడు తప్పకుండా పడుతుంది" వాసులో నిర్మొహమాటం మాట్లాడింది!

"పేదవాడిని చిన్నవాడు మోసం చెయ్యాలని చూస్తే ఆ పేదవాడు చిన్నవాడిని అవసరానికి ఉపయోగించుకుంటూ వాడిని తనంతవాడు కాకుండా చెయ్యాలని పన్నాగం పన్నుతాడు! ఇదే 'సంఘం అంతరంగం" లోకజ్ఞం పూర్తిగా జీర్ణించుకున్న ఒకాయన వర్ణన.

"ఇటువంటి సంఘాన్ని మార్చటానికి మనలో ప్రతిఒక్కరూ పోరాడాలి" వాసులో అమాయకత్వం, వాసూ మాటలు కొంతమందిని ఆకర్షించాయి.మరి కొంతమందిని ఆకట్టుకున్నాయి. ఇంకా కొంతమందిని అతన్ని తమ మధ్యగా కూర్చోపెట్టుకొని అతని చాలా ఇంకా ఎన్నో విషయాలు, మరింకెన్నో కబుర్లు చెప్పించే విధంగా చేశాయి!

అతని మాటల్లో వింత మనుషులు, విచిత్ర మనస్తత్వాలు, ఆంతరంగిక విషయాలు, సాంఘిక దురాచారాలు, రాజకీయ చాతుర్యం, ఇంకా ఎన్నెన్నో విషయాలు, చోటుచేసుకున్నాయి.

అతను అలా మాట్లాడుతూనే ఉన్నాడు. కొంత మంది వింటున్నారు. మరి కొంతమంది అతని మాటలకు అవునన్నా కాదన్నా, చివరికి అక్కడున్నవారిలో చాలా మంది నిజాన్ని కాదనలేకపోతున్నారు.

వాసు వయసుని, అతని మనసుని ఒక్కసారి అతని ప్రవర్తనతో పోల్చి చూసుకున్నాను.

ఈలోగా మా రైలు విజయవాడ చేరింది!

ఎక్కేవాళ్ళని తోసుకుంటూ దిగేవాళ్ళు, దిగేవాళ్ళమీద విసుక్కుంటూ ఎక్కేవాళ్ళతో రైలు ప్లాట్‌ఫారం ఎంతో సందడిగా ఉంది!

వాసూ కూడా రైలు దిగి ప్లాట్‌ఫారంమీద నిలబడ్డాడు. అతనికేసి ఒక్క క్షణం చూశాను ఏకత్వంలో భిన్నత్వం. భిన్నత్వంలో ఏకత్వం ఈ రెండింటి కలయికే ఈ నవ నాగరిక సమాజం. అంతటి పటిష్టమైన నిర్మాణాన్ని పెకలించాలని ఎందరో మహామహులు, వాసూలాంటి అమాయకులు నిర్విరామంగా ప్రయత్నిస్తూనే ఉన్నారు.

ఫలితం ఎవరూ చూడలేదు. ఎవ్వరికీ తెలియదు ఏ ఒక్కరూ చెప్పలేరు కూడా!

మా రైలు విజయవాడ ప్లాట్‌ఫారం వదలి గుంటూరువైపు వెళ్ళటానికి బయలుదేరుతోంది!

వాసు వచ్చి తన సీట్లో కూర్చున్నాడు. మళ్ళీ మిగతా ప్రయాణీకులు వాసూ కబుర్లు చెప్పుకోవటం మొదలుపెట్టారు!

"దయచేసి మీరు సిగరెట్ కాల్చటం ఆపుతారా?" మొహంమీదకి కమ్ముకొస్తున్న పొగలో దగ్గుతూ ఒకాయన తోటి ప్రయాణికుడిని అడిగాడు. సిగరెట్ కాలుస్తున్నాయన అతడికేసి సీరియస్‌గా చూసాడు. అలా చూస్తూ ఇంకోసారి పొగ వదిలాడు. "మీరు లేచి ఇంకో సీట్లోకెళ్ళి కూర్చోండి" దబాయింపుగా అన్నాడు. ఆ మాటలకు దగ్గుతున్న వ్యక్తి నిస్సహాయంగా చూశాడు. పైగా అతను సికింద్రాబాద్‌నుండి వస్తున్నాడు. ఈ సిగరెట్ పెద్దమనిషి బెజవాడలో ఎక్కాడు! "మాస్టారు మీరు సిగరెట్ కాల్చటం మానెయ్యాలి" వాసుకంఠం నిర్దిష్టంగా పలికింది! "రైల్లో ప్రయాణం చేస్తుంటే సిగరెట్ కాల్చటం నాకు అలవాటు. పైగా ఈ సిగరెట్ నేను 40 పైసలుకి కొన్నాను! మధ్యలో ఆర్పటం నా కిష్టంలేదు"- ఆ వ్యక్తి కూడా పట్టుదలగా అన్నాడు. "మీరు మర్యాదగా సిగరెట్ ఆర్పకపోతే బలవంతంగా మీచేతే నేను ఆర్పిస్తాను!" వాసు సీటోంచి లేచి ఆ వ్యక్తిచెయ్యి పట్టుకున్నాడు. ఇహ చేసేదిలేక ఆ వ్యక్తి అక్కడినుండి లేచి వెళ్ళిపోయాడు! దాంతో వాతావరణం మామూలుగా అయ్యింది!

"ఈ సమాజంలో ఒక మంచి మార్పు రావాలంటే మనకి ఒకరి సహకారం ఒకరికి ఉండాలి" వాసు మనసులోంచి వచ్చాయి ఆ మాటలు!

అతని మాటలకు అందరూ అవునంటే అవునని అన్నారు!

"మన మధ్య జరిగే మోసం,అన్యాయం, రూపుమాసిపోవాలంటే మనం ఒకరికొకరం సపోర్ట్ చేసుకోవాలి" వాసులోని ఐక్యతను స్పష్టం చేస్తున్నాయి అతని మాటలు.

అతను చెప్పిన మాటలు జరగాలంటే ఎంత కష్టమో నాకూ తెలుసు, అతని కబుర్లకు అవునంటున్నవారికి తెలుసు. కాని ఒకరికి తెలియకుండా ఒకరు మరొకరిని భ్రమ పెడుతున్నారు!

"ఆ బఠానీలు సార్, వేడి వేడి బఠానీలు" అంతలో ఓ కుర్రాడు బఠానీలు అమ్ముకుంటూ అక్కడికి వచ్చాడు. "నోటికీ చేతికి మధ్య దెబ్బలాటసార్, తినండి సార్ బఠానీలు" ఆ కుర్రాడు అమ్మకంలోకూడా ఒక విధమైన గమ్మత్తు!

"ఒరేయ్ అబ్బాయి, ఈ డొక్కులో పోసిన బఠానీలు ఎంత కిస్తావురా!" ఒకాయన అడిగాడు. "ఇవి పావలాసార్.ఇదిగో ఇది పది పైసలు. తీసుకోండి సార్ ఓ అర్థరూపాయివి" ఆ కుర్రాడి చొరవకి నవ్వొంది! ఇంతలో ఎవరో ఓ పావలా బఠానీలు తీసుకున్నారు! మళ్ళీ ఆ కిందటి ఆయనకి ఆ డొక్కులో బఠానీలు పోసి ఇవ్వబోతున్నాడు. వాసు అంతవరకు ఎంతో శ్రద్ధగా గమనిస్తూ "ఇదిగో ఆ డొక్కు ఒక్కసారి ఇలా ఇవ్వు చూసి ఇస్తాను" అని అడిగాడు. ఒక్కసారి ఆ కుర్రాడు కంగారు పడ్డాడు! కాని వాసు అప్పటికి ఆడొక్కుని ఆ కుర్రాడి చేతిలోంచి లాగేసుకున్నాడు! వాసుని




## మూడు లక్షలు

'లక్ష రూపాయలిస్తేగాని మీ ఆవిడ్ని ప్రాణాల్తో వదలం' బెదిరించాడు దొంగలనాయకుడు ఫోన్‌లో.

'రెండు లక్షలిస్తాను...ప్రాణాలు పోయిన తర్వాత వదలండి' తాపీగా సమాధానమిచ్చాడు ఆండాళు భర్త.

ఆర్. డేవిడ్‌విల్సన్
కావలి



అందరూ పరిశీలనగా చూస్తున్నారు. అందరి మొహంలోను ఆశ్చర్యం కనపడుతోంది.

వాసు ఆ బఠాసీల పొట్లాన్ని పరిశీలనగా చూస్తున్న పద్ధతి చూస్తుంటే ఆ క్షణంలో జరగ కూడనిది ఏదో జరుగుతుందేమో అనే అనుమానం కలగసాగింది నా మనసులో!

ఆ పొట్లాన్ని వాసు లోపలికంటూ ఒక్కసారి చూసి వెంటనే చేతివేళ్ళతో లోపల అంటించి పెట్టిన కాగితాల చుట్టను పైకిలాగాడు! ఆశ్చర్యం ఏమిటంటే ఆ పొట్లంలో అంత లావుపాటి కాగితాలచుట్ట రంగు కూడా తెలియకుండా పెట్టినట్టు ఎంతో శ్రద్ధగా గమనిస్తేనేగాని తెలియదు! అది వాసు కనిపెట్టాడు!

వాసు మొహంలో కోపం చిందులు తొక్కింది. వెంటనే ఆ బఠాసీల కుర్రాడిని చొక్కా పట్టుకుని "ఏరా ఇలా ఎంతమందిని మోసం చేస్తున్నావురా! డబ్బులు మాత్రం నీకు బాగానే కావాలి! కాని బఠాణీలు మాత్రం డబ్బులకి సరిపడా ఇవ్వవా? వేలెడంతలేవు నీకు ఇప్పటినుండే మోసం, దగా అలవాటయ్యాయి అన్నమాట" అంటూలాగి లెంపకాయ కొట్టాడు!

వాసు చేతల్లో కాఠిన్యం, అక్కడివారందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తుండగా దెబ్బలుతిన్న బఠాసీల కుర్రాడు చెంప తుడుచుకుంటూ, కళ్ళు తుడుచుకుంటూ బఠాసీలు అమ్మటం మానివేసి అక్కడినుండి అంతే ఆ కంపార్ట్‌మెంట్‌లోంచి మెల్లగా వెళ్ళిపోయాడు!

ఒక్క క్షణం మేము కూర్చున్న కంపార్ట్‌మెంట్‌లో నిశ్శబ్దం చోటు చేసుకుంది!

వాసు మొహంలో కోపం ఇంకాఅలాగేఉంది!

"ప్రతీ చిన్న విషయంలోనూ మోసమే ఈ రోజుల్లో" ఎవరో అంటున్నారు! "అయినా ప్రతీ చిన్న విషయాన్నీ అంత బాగా పరిశీలించాలంటే మన జీవిత కాలం సరిపోదు" ఏ విషయం అంతగా పట్టించుకోకూడదనుకునే ఒకాయన మనస్తత్వం!

"అయితేమాత్రం ఇలా ఎన్ని మోసాలు సహించగలం" అందర్ని చూస్తూ అడగాలనిపించినా నేను నాకు తెలియకుండానే నిర్లిప్తంగా ఉండిపోయాను!

"ఏమైనా అంత చిన్న కుర్రాడిని కొట్టటం ఏం బాగోలేదండి, ఏదో పాపం చిన్న వెధవ తెలియక చేసి ఉంటాడు!" బఠాసీల కుర్రాడిపైన సానుభూతి!

"కుర్ర వెధవే అంత మోసం చేస్తుంటేచూస్తూ ఊరుకోవటమేనా మన పని" వాసు ఉద్రేకం మాటల్లో అందరిపైనా దూకుతోంది!

"అలాగని కుర్రాడిని ఇంత చిన్న విషయానికి నువ్వు కొట్టగలిగావు, కాని అదే పెద్దవాడిని కొడితే వాడే నిన్ను చావగొట్టేసేవాడు తెలుసా?" వాసు చేసిన పనికి వ్యతిరేకత బయలుదేరింది ఒకొక్కరిమంచే!



# పెళ్లి పల్లకి

## మీ జీవిత భాగస్వామిని ఎన్నుకోవాలనుకుంటున్నారా?

వివాహం నూరేళ్ళ పంట, జీవితంలో అత్యంత మధురానుభూతికి, విడరాని అనుబంధానికి సంకేతం.

"పల్లకి"లో మీ అబ్బాయి, అమ్మాయి స్వయంవరాన్ని చాటండి. మీకు నచ్చిన వరుణ్ణి, వధువును పల్లకి తీసుకొని వస్తుంది. మీ ఇంట్లో మంగళతూర్య నాదాలను ప్రోగించుతుంది. మీ ప్రకటన వీలయినంత క్లుప్తంగా ఆరులైన్లకి మించకుండా ఉండాలి. ప్రకటనతో రు. 15/-కు డ్రాఫ్టుగాని, ఎం. ఓ. రసీదుగాని జతచేసి పంపండి.

* పట్టభద్రుడు, ప్రభుత్వోద్యోగి, అభ్యుదయ భావాలు, చక్కటి శరీర సౌష్టవం కల్గిన అందమైన కమ్మ యువకునికి, ఆదే కోవకు చెందిన, ఏ ప్రసక్తి లేని, రాని, అందమైన వధువు కావలెను. ఫోటో, పూర్తి వివరాలతో వ్రాయండి బాక్స్ నం. 141.

* 29 సం॥ లు గల పి. యు. సి. పాసయి రైల్వే ఉద్యోగిగా నెలకు రు 900/- లు జీతము తీసుకుంటున్న ఏ బాదరబందీ లేని యువకునకు రెడ్డి కులమునకు చెందిన 28 సం॥లు దాటని యువతి కావలెను. కట్న కానుకల ప్రసక్తి లేదు బాక్స్ నెంబరు 142.

* 50 సం॥ల వయసుగల వరునకు 40-45 సం॥ల వయస్సుగల వధువు కావాలి. ఆసక్తిగలవారు ఫోటో వివరాలతో రాయండి. బాక్స్ నెం. 143.

* డిగ్రీపాసయి ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ నెలకు రూ.లు 1300/- జీతం కల్గిన విడాకులు పొందిన 29 సం॥ల పద్మశాలి యువకునికి రెండవ వివాహమునకు అదే కులానికి చెందిన అందమైన, చదువు, సంస్కారవంతురాలైన వధువు కావాలి. కట్నకానుకల ప్రసక్తి లేదు.ఫోటోవివరాలతో బాక్సునెం.144.

"అయితే మాత్రం మోసం చిన్నదయినా పెద్దదయినా తప్పేనా కాదా?" వాసు మనసులోని నిజాయితీ అతని మాటల్లో ఆరాటపడుతుంది!

"అయినా పంతులూ వాడు తెలవకడుగుతా ఆ కుర్రాడు నిన్ను బఠాసీలు కొనమని కాళ్ళు పట్టుకున్నాడా, ఉత్తినే పట్టుకు కొట్టేశావు" కాండ్రించి ఉమ్ముతూ మరీ అడిగాడు ఓ ఆసామీ.

వాసు కూర్చున్న వాడల్లా లేచి ఏదో అనబోయాడు. అంతా "చాల్లే చాల్లేవయ్యా వెర్రి పంతులూ, పెద్ద మొగాడివి బయలుదేరావు. ఈ రోజుల్లో జరిగే మోసాల్ని, దగాని అరికట్టటానికి ఆపటానికి!" ఎవరో వాసూని వేళాకోళం చేశారు.

"అయినా ఆ బఠాసీల కుర్రాడి బేరం పాడుచేసి వాడి పొట్టమీద కొట్టటం ఏమాత్రం మంచి పని కాదు నాయనా!" ఓ వయసు మళ్ళిన తాతగారు తన అనుభవాన్ని వాసుకి వ్యక్తం చేశాడు.

"ఎక్కడికక్కడ సరిపెట్టుకుంటూ పనులు చూసుకుంటూ పోవటం తెలివైనవాడి లక్షణం అదే బ్రతుకు తెరువు" ఓ ఖద్దరులాల్చీ వ్యాఖ్యానం

ఇలా అక్కడ వాళ్ళందరూ వాసు మనసుని, వ్యక్తిత్వాన్ని తమ మాటలతో ముక్కలు ముక్కలుగా నరుకుతుంటే రైలు ఏదో స్టేషన్‌లో ఆగింది.

మనసులోని శూన్యత మొహంలో కనపడుతుంటే వాసు తన సీటులోంచి మెల్లగా లేచాడు.

మోసం, దగా, వంచన ఇవన్నీ ప్రతీ ఒక్కరూ చెయ్యగలరు, కాని వీటన్నింటిని తన నిజాయితీతో ఆపగలిగే వాళ్ళు వాసూలాంటివాళ్ళా నా మనసులోని వివేకం స్పష్టంగా అనుకుంది.

ఇలా నిజాయితీగా బ్రతకాలని తోటివాడిని కూడా తనలాగే బ్రతికించాలని అనుకునే వాసూలాంటి మనుషులకు ఈ లౌకిక సమాజంలో గౌరవం, గుర్తింపు కలిగే రోజంటూ ఉంటుందా? ఎప్పటికీ జవాబు దొరకని ప్రశ్న అని నాకు తెలుసు.

వాసు రైలు దిగి మెల్లగా నడుస్తున్నాడు.

"ఇదిగో పంతులు అలాదిగివెళ్ళిపోతున్నావేంటి నువ్వు దిగేది గుంటూరు కదా! ఎనక్కొచ్చి రైలెక్కు, మళ్ళీ రైలు కదిలిపోగలదు!"

"కుళ్ళు, కల్మషం ఈ సంఘంయొక్క అంతరంగం అని అలవాటుపడి బ్రతుకు" అంటున్న మనుషుల పిలుపు, నీతిని వెతుక్కుంటూ వెళ్ళిపోతున్న వాసు హృదయాన్ని వెనక్కి రప్పించలేదని అనుకుంటుంటే రైలు నంబూరు స్టేషన్‌నుండి బయలుదేరింది! *